క్లుప్తంగా

ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

రాజంపేట: ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఐ కామారెడ్డి జిల్లా నాయకులు జిల్లా కార్యదర్శి ఎల్ దశరథ్ డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో రాజంపేట, ఆర్గొండ, కొండాపూర్, బస్వన్నపల్లి గ్రామాలలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ఇంటింటికి కార్యక్రమాన్ని చేపట్టారు.

మహిళలు రాజకీయాల్లో ముందుండాలి

భిక్కనూరు: మహిళలు రాజకీయాల్లో ముందుండాలని బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు పావని అన్నారు. బుధవారం జంగంపల్లిలో జరిగిన మహిళా మోర్చా సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కామారెడ్డి బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పోరాటం వల్లనే ప్రభుత్వం పొదుపు మహిళలకు పావల వడ్డీ ఇచ్చేందుకు ముందుకువచ్చిందని గుర్తు చేశారు. నేతలు ప్రమీల, రేణుకా, పరిశీలకుడు వలకొండ రవీందర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు రమేషురెడ్డిలు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యం చేస్తే కఠిన చర్యలు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): విద్యుత్ చౌర్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఇన్చార్జి మండల విద్యుత్ అధికారి సాయినాథ్ గౌడ్ హెచ్చరించారు. బుధవారం బేగంపూర్ తండాలో అక్రమంగా విద్యుత్ చౌర్యం చేస్తున్న వారి విద్యుత్ తీగలను తొలగించారు. మరోసారి విద్యుత్ చౌర్యానికి పాల్పడితే వారిపై కేసు నమోదు చేస్తామన్నారు.

చెక్కుల పంపిణీ

బాన్సువాడ: సీఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం లబ్ధిదారులకు స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి తన నివాసంలో అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు అంజిరెడ్డి, కృష్ణారెడ్డి, ఎజాస్, పాత బాలకృష్ణ, గంగాధర్, శ్రీధర్, గోపాల్‌రెడ్డి, మోహన్ నాయక్ ఉన్నారు.

'సీపీఆర్'పై అవగాహన

రామారెడ్డి(ఎల్లారెడ్డి): సీపీఆర్ విధానంపై పీఎంపీలు, ఆర్ఎంపీలు, వైద్య సిబ్బందితో పాటు ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులకు డాక్టర్లు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీపీ దశరథ్ రెడ్డి, స్థానిక సర్పంచ్ సంజీవ్, ఎంపీవో సవిత హాజరయ్యారు. అవగాహన సదస్సులో భాగంగా సీపీఆర్ ఏవిధంగా చేయాలో డాక్టర్ మానస వివరించారు.

ఏడుగురు ఆర్టిజన్ల తొలగింపు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి విద్యుత్ శాఖ పరిధిలో సమ్మె చేస్తున్న ఏడుగురు ఆర్టిజన్లను తొలగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎల్లారెడ్డి విద్యుత్ శాఖ డీఈ గణేష్ బుధవారం తెలిపారు.ఎస్మా చట్టం అమలులో ఉన్నా కూడా వారు సమ్మె చేయడంతో తొలగించినట్లు చెప్పారు.

వీగిపోయిన అవిశ్వాసం

బాన్సువాడ రూరల్: బుడిమి వైస్ చైర్మన్‌గా కొనసాగుతున్న మధుసూదన్‌రెడ్డిపై డైరెక్టర్లు ఇటీవల అవిశ్వాస తీర్మానం పెట్టారు. బుధవారం ఓటింగ్‌కు 9 మంది డైరెక్టర్లు హాజరు కావాల్సి ఉండగా 8 మంది మాత్రమే హాజరు కావడంతో కోరం లేక అవిశ్వాసం వీగిపోయినట్లు డీసీవో వసంత ప్రకటించారు.

దేశాన్ని తాకట్టు పెట్టిన కేంద్రం

భిక్కనూరు: కేంద్ర ప్రభుత్వం దేశాన్ని అంబానీ, అదానీలకు తాకట్టు పెట్టి ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి దశరథ్ అన్నారు. బుధవారం భిక్కనూరు మండల కేంద్రం, పెద్దమల్లారెడ్డి, కంచర్ల గ్రామాల్లో పల్లె పల్లెకు సీపీఐ కార్యక్రమంలో భాగంగా ఆ పార్టీ నేతలు పర్యటించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి దశరథ్ మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యాయన్నారు.

'కార్మికులకు జీవన వేతనం అమలు చేయాలి'

కామారెడ్డి అర్బన్: దేశంలో కార్మికుల కుటుంబ పోషణకు కనీస వేతనాలకు బదులుగా జీవన వేతనం అమలు చేయాలని, ఒప్పంద వ్యవస్థను రద్దు చేసి రెగ్యులర్‌గా తీసుకోవాలని భారతీయ మజ్దూర్ సంఘ్(బీఎంఎస్) రాష్ట్ర కార్యదర్శి సందుగారి రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట బీఎంఎస్ ఆధ్వర్యంలో కార్మిక సమస్యలపై నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఏవో రవీందర్‌కు వినతి పత్రం అందజేశారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



సాక్షినెట్‌వర్క్: అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను అన్ని విధాల ఆదుకుంటామని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి అన్నారు. బుధవారం బీబీపేట పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. అలాగే సదాశివనగర్, ఎల్లారెడ్డి, కామారెడ్డి, భిక్కనూరు, పిట్లం మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అకాల వర్షం..అతలాకుతలం



వడగండ్ల వానకు మృతి చెందిన రామచిలుకలు



లింగంపేట: బోరున విలపిస్తున్న మహిళా రైతు



తిర్మలాపూర్‌లో పరిశీలిస్తున్న బీజేపీ నేత మాల్యాద్రి రెడ్డి



పొందుర్తిలో వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

- వందల ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
- ఈదురు గాలులకు స్తంభాలు ధ్వంసం, ఎగిరిపోయిన ఇళ్ల పైకప్పులు
- నష్టపోయిన పంటలను పరిశీలించిన అధికారులు, ప్రజాప్రతినిధులు
- ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల వేడుకోలు

జిల్లాలో మంగళవారం కురిసిన అకాల వర్షం కారణంగా చేతికొచ్చిన పంటలు దెబ్బతిన్నాయి. చాలా చోట్ల రోడ్లపై ఆరబోసిన వరి ధాన్యపు రాశులు కొట్టుకుపోయాయి. బుధవారం వర్షం తెరపివ్వడంతో వ్యవసాయ అధికారులు, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. నష్టపోయిన ప్రతి రైతు వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని అధికారులు వివరించారు. ప్రభుత్వం నుంచి పంట నష్ట పరిహారం అందేలా చూస్తామని అన్నారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలంటూ పలు చోట్ల రైతులు రాస్తారోకోలు, ధర్నాలు నిర్వహించారు.

–సాక్షి నెట్‌వర్క్



భవానిపేటలో.. కాంగ్రెస్ నేత వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి



బోర్లంక్యాంపులో.. కాంగ్రెస్ నేత మదన్‌మోహన్



లింగంపల్లికలాన్‌లో ధ్వంసమైన పాఠశాల పైకప్పు రేకులు



బండపల్లిలో ఈదురు గాలులకు ఎగిరిపోయిన హోటల్‌పై రేకులు



గాంధారి మండలంలో .. తహసీల్దార్ గోవర్ధన్



జంగంపల్లిలో.. బీజేపీ నేత రమణా రెడ్డి



రాజంపేట: నేలరాలిన మామిడి కాయలను చూపుతున్న రైతు



మాల్తుమ్మెద ఉద్యానక్షేత్రంలో..



కన్నారెడ్డిలో విరిగిన విద్యుత్ స్తంభం



ధర్మారావుపేట్‌లో పరిశీలిస్తున్న అధికారులు



తడిసిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతు



ఆత్మకూర్ శివారులో వర్షానికి కొట్టుకుపోయిన ధాన్యం



వెల్లుట్లపేటలో గాలి వాన బీభత్సానికి కూలిన చెట్లు, పాఠశాల గోడ



దామరంచలో పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు



పాతరాజంపేటలో రైతులను ఆదుకోవాలని రాస్తారోకో చేస్తున్న అధికార పార్టీ కామారెడ్డి జెడ్పీటీసీ చిదుర రమాదేవి

వీవోఏలకు రూ.26 వేల వేతనమివ్వాలి

కామారెడ్డి టౌన్: తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఆర్డీవో కార్యాలయం ముందు చేపడుతున్న ఐకేపీ వీవోఏల నిరవధిక సమ్మె బుధవారంతో మూడవ రోజుకు చేరుకుంది. సమ్మె శిబిరానికి కామారెడ్డి జెడ్పీ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్ రెడ్డి హాజరై మాట్లాడారు. వీవోఏలకు నెలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం గుర్తింపు కార్డు ఇచ్చి రూ.10 లక్షల ఇన్సూరెన్స్ వర్తింపజేయాలన్నారు.

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో వీవోఏల సమ్మె బుధవారం రెండో రోజుకు చేరుకుంది. ఐకేపీ కార్యాలయం ముందు వారు ధర్నా నిర్వహించారు.



ఆర్డీవో కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న వీవోఏలు

బస్టాండ్‌లో హిజ్రాల హల్‌చల్

- ప్రయాణికుల నుంచి బలవంతంగా డబ్బుల వసూళ్లు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి బస్టాండ్‌లో బుధవారం కొందరు హిజ్రాలు హల్ చల్ చేశారు. బస్టాండ్‌లో ప్లాట్‌ఫాంపై ఉన్న ఓ బస్సులో ప్రయాణికులను డబ్బులు అడుగుతున్నారు. అందులో ఉన్న ఓ దంపతుల నుంచి బలవంతంగా డబ్బులు లాక్కోవడంతో అక్కడ గొడవ జరిగింది. ఈ విషయం ఆర్టీసీ అధికారులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే బస్సులో ప్రయాణికులు హిజ్రాలను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. పోలీసులు ఇరు వర్గాలకు నచ్చజెప్పి వివాద సద్దుమణిగించారు.

అభివృద్ధి చేయలేని అధికారులెందుకు?

- తాడ్వాయి సర్వసభ్య సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రజా ప్రతినిధులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి మండలాన్ని అభివృద్ధి చేయలేని అధికారులు ఎందుకని ఎంపీటీసీలు, సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడ్వాయి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ కౌడి రవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తాడ్వాయి, దేమికలాన్, కరడ్‌పల్లి, క్రిష్ణాజివాడి, చిట్యాల గ్రామాలలో తాగు నీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సర్పంచ్‌లు బాలచంద్రం, పోరాజు, భూషణం, ఎంపీటీసీ జలంధర్‌రెడ్డి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ ద్వారా నీరు సక్రమంగా సరఫరా కావడంలేదన్నారు. అలాగే పలు సమస్యలపై సమావేశంలో చర్చ జరిగింది. ప్రజాప్రతినిధుల ప్రశ్నలకు అధికారులు సమాధానాలిచ్చారు. ఎంపీడీవో రాజ్‌వీర్, తహసీల్దార్ వెంకటేష్, వైస్ ఎంపీపీ నర్సింలు, జెడ్పీటీసీ రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

సమాచారం..

నేడు నాన్ మైనార్టీ విభాగంలో అడ్మిషన్లకు డ్రా

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి పట్టణంలోని మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో నాన్ మైనార్టీ విభాగంలో విద్యార్థులకు లక్కీ డ్రా ద్వారా అడ్మిషన్లు ఇవ్వనున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ సుధాకర్ బుధవారం తెలిపారు. నాన్ మైనార్టీ విభాగంలో ఎస్సీ 2, ఎస్టీ 2, బీసీ 5, ఓసీ 1 సీట్లు కేటాయించామని, గురువారం ఉదయం 11 గంటలకు పాఠశాల ఆవరణలో లక్కీ డ్రా తీయనున్నట్లు వెల్లడించారు.

బేతాళస్వామి జాతర

బాన్సువాడ : బాన్సువాడ పట్టణంలో గురువారం నుంచి బేతాళస్వామి జాతర ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. డివిజన్‌లో అతి పెద్ద జాతరగా బేతాళ స్వామి జాతర నిర్వహిస్తారు. గురువారం ఎడ్ల బండ్ల ప్రదర్శన, శుక్రవారం కుస్తీ పోటీలు, శనివారం జాతర వేడుకలను నిర్వహించనున్నారు.

పంచాయతీ కార్యదర్శుల ర్యాలీ

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలో గురువారం పంచాయతీ కార్యదర్శులు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జిల్లా పంచాయతీ కార్యదర్శుల అసోసియన్ నాయకులు తెలిపారు. క్రమబద్ధీకరణ చేయాలని కోరుతూ జిల్లాలోని ఉన్న 536 మంది కార్యదర్శులతో జిల్లా కేంద్రంలోని సీఎస్ఐ చర్చి నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తామన్నారు.

బీజేపీ పథకాలను ప్రజలకు వివరించాలి

భిక్కనూరు: ప్రధాని నరేంద్ర మోదీ చేపట్టిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని బీజేపీ మండలాధ్యక్షుడు రెడ్డిగారి రమేశ్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన భిక్కనూరు మండల కేంద్రంలో యువ మోర్చ యువనేతల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి కార్యకర్త ప్రతి రోజు గంట పాటు పార్టీ అభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారం కోసం కేటాయించాలన్నారు. బీఆర్ఎస్ నేతల అక్రమాలపై దృష్టి సారించి ప్రజలకు వివరించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ వర్సెస్ బీఆర్ఎస్ మాత్రమే పోటీ ఉంటుందన్నారు. కాంగ్రెస్ పూర్తిగా కనుమరుగైందన్నారు. సమావేశంలో బీజేపీ పరిశీలకుడు ఏలేటి గణేశ్‌రెడ్డి, బీజేవైఎం మండలాధ్యక్షుడు రాకేశ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



భిక్కనూరులో సమావేశమైన బీజేపీ నేతలు

రైతులు అధైర్య పడొద్దు

- పంట నష్ట పరిహారం అందిస్తాం
- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్



చింతల్‌గుట్ట తండాలో వడగండ్ల వానకు ధ్వంసమైన వరి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

లింగంపేట(ఎల్లారెడ్డి): రైతులు అధైర్యపడవద్దని, ప్రభుత్వం అన్ని విధాలా రైతులను ఆదుకుంటుందని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ భరోసా ఇచ్చారు. బుధవారం ఆయన అయిలాపూర్, మెంగారం, చింతల్‌గుట్టతండా, బోనాల్, భవానిపేట, ముంబోజిపేట, జల్దిపల్లి గ్రామాల్లో నష్టపోయిన పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కంటతడి పెట్టిన రైతులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తాను పంటలు పరిశీలించి నష్టపోయిన వివరాలను ప్రభుత్వానికి అందించి పరిహారం అందేలా చూస్తానన్నారు. లింగంపేట మండలంలో 4,600 ఎకరాల్లో వరి పంట నష్టం జరిగినట్లు వ్యవసాయాధికారులు నివేదిక ఇచ్చినట్లు తెలిపారు. ఆయన వెంట జెడ్పీటీసీ శ్రీలత, వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ దేవేందర్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు రమేశ్ ఉన్నారు.

ఆరోగ్య రక్షణ కోసమే ఫిల్టర్ వాటర్

శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి

నిజాంసాగర్(జుక్కల్): మనిషి అనారోగ్యం బారిన పడకుండా ఆరోగ్య రక్షణకు ఫిల్టర్ వాటర్ ఎంతో అవసరమని ప్రముఖ శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి అన్నారు. బుధవారం నర్వ గ్రామంలో తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఫిల్టర్ వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామస్తులనుద్దేశించి ఆయన మాట్లాడారు. ప్రతీ రోజు ఉదయం నిద్రలేవగానే ప్రతీ ఒక్కరు ఒక్క లీటర్ వాటర్ సేవిస్తే కాళ్లు, కీళ్ల నొప్పులు ఉండవని అన్నారు. ప్రతీ ఒక్కరికి ఫిల్టర్ వాటర్‌ను అందించాలన్న సంకల్పంతో వాటర్ ప్లాంట్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. గ్రామ సర్పంచ్ గోర్గంటి సంగమణి, నాగిరెడ్డిపేట జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, ఎంపీపీ రాజ్‌దాస్, ఆత్మకూర్ సర్పంచ్ బాల్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మండలం ఉగ్రవాయి గ్రామంలో రవికుమార్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ బుధవారం ముగిసింది. వారం రోజుల నుంచి టోర్నమెంట్ నిర్వహించగా ఫైనల్లో కామారెడ్డి వర్సెస్ రామారెడ్డి జట్లు తలపడ్డాయి. విజేతగా కామారెడ్డి టీం నిలిచింది. ప్రథమ బహుమతిగా రూ.8 వేల నగదును కామారెడ్డి టీమ్‌కు అందజేశారు. అలాగే రెండవ బహుమతి రామారెడ్డి టీం గెలుపొందగా రూ.4 వేలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్గనైజర్లు ప్రశాంత్ గౌడ్, అభిలాష్, మహేందర్, రవి, ప్రవీణ్, సంజు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

సంక్షిప్తం

మన ఊరు–మన బడి పనుల పరిశీలన

కామారెడ్డి రూరల్: దేవునిపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో జరిగిన మన ఊరు–మన బడి పనులను బుధవారం టీఎస్ఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి పరిశీలించారు. టాయిలెట్ల నిర్మాణం, గ్రీన్ చాక్ బోర్డ్స్, డ్యూయల్ డెస్క్‌లు, పెయింటింగ్స్‌లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ వెంకటేష్ దొత్రే, డీఈవో రాజు, ఎంఈవో ఎల్లయ్య, స్కూల్ హెచ్ఎం గంగాకిషన్ ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

పిట్లం(జుక్కల్): ప్రతి ఒక్కరూ తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని హెడ్ కానిస్టేబుల్ సాయాగౌడ్ పేర్కొన్నారు. ఆయన సిబ్బందితో కలిసి చిల్లర్గి గ్రామంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో గ్రామస్తులకు ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

రెండోరోజుకు చేరిన నిరసన దీక్షలు

భిక్కనూరు: ఎంఎస్ఎన్ కెమికల్ ఫ్యాక్టరీ సీఎస్ఆర్ నిధులతో గ్రామాభివృద్ధి చేపట్టవద్దని డిమాండ్ చేస్తూ కాచాపూర్‌లో వీడీసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు బుధవారం నాటికి రెండో రోజుకు చేరుకున్నాయి. గ్రామ యువకులు ఫ్యాక్టరీ యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లకు శంకుస్థాపన

మద్నూర్(జుక్కల్): డోంగ్లీ మండలంలోని మదన్‌హిప్పర్గాలో బుధవారం డబుల్ బెడ్ రూం ఇళ్ల పనులకు గ్రామ సర్పంచ్ రాజు పటేల్ శంకుస్థాపన చేశారు. ఉప సర్పంచ్ నాగబాయి, మాజీ సర్పంచ్ విఠల్‌రావ్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు హన్మంత్‌పటేల్ ఉన్నారు.

బాన్సువాడ ఆస్పత్రికి క్యూఎంఎస్ గుర్తింపు

బాన్సువాడ : బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి క్వాలిటీ మేనేజ్‌మెంట్ సిస్టమ్(క్యూఎంఎస్) గుర్తింపు రావడం హర్షణీయమని ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ ప్రసాద్ అన్నారు. ఆస్పత్రి ఎయిడ్స్ నియంత్రణ విభాగానికి క్యూఎంఎస్‌లో నాణ్యత నిర్వహణ గుర్తింపు పత్రం వచ్చిందని తెలిపారు. ఎయిడ్స్ నియంత్రణకు చేసిన సేవలకు గాను ఈ గుర్తింపు వచ్చినట్లు శ్రీనివాస్ చెప్పారు.

నూతన మొక్కజొన్న రకంపై క్షేత్ర ప్రదర్శన

మాచారెడ్డి : శ్రీరామ్ బయోసీడ్ కంపెనీ కొత్త మొక్కజొన్న రకం 9766 పై ఆరేపల్లిలో బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. గ్రామానికి చెందిన కందాడి రవీందర్‌రెడ్డి పొలంలో క్షేత్ర స్థాయి ప్రదర్శన నిర్వహించారు.

పోచారంలో కంటి వెలుగు ప్రారంభం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): పోచారంలో బుధవారం గ్రామ సర్పంచ్ విజితారెడ్డి, ఎంపీడీవో రఘుతో కలిసి కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. మాల్తుమ్మెద సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఉపసర్పంచ్ రవీందర్, పంచాయతీ కార్యదర్శి తిరుపతి పాల్గొన్నారు.

ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలి

పిట్లం(జుక్కల్): గ్రామ పంచాయతీల పరిధిలో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపటాలని ఎంపీడీవో వేంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆయన బుధవారం కారేగాం పంచాయతీని సందర్శించి రికార్డులు పరిశీలించారు.

ఘనంగా ఎల్లమ్మ తిరుగు బోనాలు

దోమకొండ: మండల కేంద్రంలో ఎల్లమ్మ ఆలయ వార్షిక ఉత్సవాల్లో భాగంగా తిరుగుబోనాలు నిర్వహించారు. అనంతరం పుట్ట ఎల్లమ్మ వద్ద పూజలు చేశారు.జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, గౌడ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.